పందుల స్వైర విహారం

- జీవీఎంసీ సిబ్బంది తీరుపై విలీన ప్రాంత ప్రజల ఆగ్రహం
- రోగాలు వస్తాయని ఆందోళన

పెందుర్తి: అసలే వర్షాకాలం.. దోమలు ఈగలతో రోగాలు విజృంభిస్తున్నాయి. ఈ క్రమంలో పలు రోగాలకు వాహకాలైన పందులతో కూడా యుద్ధం చేయాల్సిన దుస్థితి జీవీఎంసీ విలీన ప్రాంతాల ప్రజలది. శివారు ప్రాంతాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా జనవాసాల్లో సంచరించి ప్రజల్లో భయాందోళనలు రేపుతున్నాయి. నివాసాల మధ్యలో ఉన్న మరుగు కాలువలను ఆవాసాలుగా చేసుకుని తిష్ట వేస్తున్నాయి. అకస్మాత్తుగా ఇళ్లల్లోకి చొరబడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎన్నో స్వల్ప, దీర్ఘకాలిక రోగాలకు కారకాలైన ఈ పందుల నియంత్రణలో యంత్రాంగం విఫలమవుతుందని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు నియంత్రణలోకి రాని తరుణంలో ఈ పందుల సంచారంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు పందుల పెంపకందార్లకు పందుల వల్ల


శారదానగర్‌లో ఇళ్ల మధ్య పందులు


పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తిరుగుతున్న పందులు

కలిగే నష్టాల గురించి వివరించి వారిని మరో జీవనోపాధి వైపు చైతన్య పరచడంలో కూడా యంత్రాంగం విఫలమవుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి.

మురుగులో తిష్ట

పందుల వృద్ధికి జీవీఎంసీ విలీన ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నిలిచిపోతున్న మురుగు కూడా కారణం. సాధారణంగా పందులకు మురుగే నివాస ప్రాంతం. ఈ క్రమంలో జీవీఎంసీ జోన్–8 పరిధిలోని పది వార్డుల్లో ఎక్కడ చూసినా అవుట్‌లెట్ సదుపాయం లేక మురుగు నిలిచిపోతుంది. దీంతో పందుల సంచారం కూడా పెరిగిపోతుంది. చాలా ప్రాంతాల్లో ఇళ్ల మధ్య మురుగులోనే పందులు ఆవాసంగా చేసుకుని ఉండడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పందుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, కృష్ణరాయపురం, పురుషోత్తపురం, వేపగుంట ప్రాంతాల్లో వందలాది పందులు సంచరిస్తున్నాయి.
- జీవీఎంసీలో విలీనమైన ఆయా ప్రాంతాల్లో వాడుకనీరు పోయేందుకు సరైన అవుట్ లెట్ సదుపాయం లేదు. ఎక్కడికక్కడే మురుగు నిలిచిపోవడం పందుల సంఖ్య పెరగడానికి కారణమవుతోంది.


చినముషిడివాడ ప్రాంతంలో సంచరిస్తున్న పందులు

- పెందుర్తి, చినముషిడివాడ ప్రాంతాల్లో పందుల పెంపకం కేంద్రాలు అధికంగా ఉన్నాయి.
- జీవీఎంసీ అధికారులు పందుల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా అవి కార్యరూపం దాల్చడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పందుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పందుల నియంత్రణకు చర్యలు

పందుల సంచారంపై ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రత్యేక బృందాల ద్వారా పందుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా పందుల నియంత్రణ చేపడతాం.

– హైమావతి, జెడ్సీ, జోన్–8

గుర్తుకొస్తున్నాయి..


ఒకే వేదికపై పెందుర్తి జూనియర్ కళాశాల 1989-90 బ్యాచ్ విద్యార్థులు

పెందుర్తి: వారంతా దాదాపు 34 ఏళ్ల కిందట కలిసి ఇంటర్మీడియట్ చదువుకున్నారు. వారిలో కొందరు ఫారిన్‌లో.. ఇంకొందరు ఇతర రాష్ట్రాల్లో.. మరికొందరు అధికారులుగా..వ్యాపారస్తులుగా స్థిరపడ్డారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం వారంతా కలిసి సందడి చేశారు. 1989–90లో పెందుర్తి జూనియర్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులంతా కలిసి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆడిపాడి సందడి చేశారు. ఆ నాటి అధ్యాపకులను రప్పించి ఘనంగా సత్కరించి ఆశీసులు తీసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. మధురమైన జ్ఞాపకాలు మూటకట్టుకొని వీడ్కోలు తీసుకున్నారు.

తీరంలో సందడి



వారాంతంతో పాటు స్నేహితుల దినోత్సవం కావడంతో ఆదివారం పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలకు సందర్శకులు భారీగా తరలి వచ్చారు. సముద్రం చెంతన ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఇసుక తిన్నెలపై క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి ఆట పాటలతో కాలక్షేపం చేశారు. సాయంత్రం తీరంలో జలకాలాటలతో సందడి చేశారు. – పరవాడ

క్లుప్తంగా

త్వరితగతిన రోడ్డు నిర్మాణం


రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం బీఆర్‌టీఎస్ రహదారి నుంచి గొల్లవిల్లివానిపాలెం వరకు నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.05 కోట్ల నిధులతో ఈ రహదారి నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాజా, వీరభద్ర, నాయకులు రోమాల నూకరాజు, ఆకుల చెల్లారావు, అంగటి సూరిబాబు, అత్తిలి నాగేంద్రకుమార్, ప్రసాద్, బల్లంకి శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం


ప్రత్యేక అలంకరణలో భువనేశ్వరీదేవి

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధిలోని మణిపురంలో కొలువైన భువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండలం రోజులకు ఒకసారి నిర్వహించే ఈ అధివాసంను ఒక్కో పత్రితో నిర్వహిస్తారు. ఈ అధివాసాన్ని తామరపత్రితో నిర్వహించారు. ముందుగా జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు బారులుతీరి అమ్మవారికి మంగళస్నానాలు చేయించారు.అనంతరం క్షీరాభిషేకాలు నిర్వహించారు.అమ్మవారి సన్నిధిలో మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

సింహగిరిపై ప్రత్యేక పూజలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

వైభవంగా అమావాస్య తిరువీధి

అమావాస్య పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం సాయంత్రం తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకీలో అధిష్ఠింపజేసి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన వృద్ధురాలు


గౌరినాయుడుకు పైడమ్మను అప్పగిస్తున్న షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి

అల్లిపురం : కుమార్తెతో కలిసి విజయనగరం వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చిన వృద్ధురాలు తప్పిపోయింది. శనివారం రాత్రి ఆమెను గుర్తించిన టూటౌన్ పోలీసులు ఏయూటీడీ సిబ్బందికి ఆమెను అప్పగించారు. ఆమె మూగ, చెముడు కావటంతో ఏయూటీడీ సిబ్బంది ఆమె వద్ద గల పెన్షన్ స్లిప్ ఆధారంగా మద్దిలపాలెం పరిసర ప్రాంతాల్లో గల సచివాలయాలకు ఆమె వివరాలను పంపించి చిరునామా తెలుసుకున్నారు. ఆమె పేరు పైడమ్మగా గుర్తించి ఆమె కుమార్తె ఫోన్ నంబర్‌ను కనుక్కున్నారు. దీంతో మద్దిలపాలెంలో ఉంటున్న ఆమె మనవడు గౌరినాయుడుని పిలిపించి అప్పగించారు. పైడమ్మ మనవడు తమ అమ్మమ్మను రక్షించి, ఆశ్రయం కల్పించిన ఏయూటీడీ మహిళా షెల్టర్ నిర్వాహకురాలు జ్యోతిర్మయికి, సిబ్బందికి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

గీతం ఆస్పత్రి వద్ద మృతుని బంధువుల ఆందోళన


ఆందోళన చేస్తున్న సురేష్ భార్య రూనీ్స, కుటుంబ సభ్యులు


సంఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వైద్యుల నిర్లక్ష్యంతోనే భర్త చనిపోయాడని భార్య ఆరోపణ

కొమ్మాది : వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడంటూ ఓ మహిళ గీతం ఆస్పత్రిలో ఆందోళనకు దిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన పంతం సురేష్ (37) శనివారం ఉదయం ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండగా ఆయన భార్య రూనీ్స చికిత్స నిమిత్తం రుషికొండలో గల గీతం ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం ఉదయం వరకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉందని ఎక్కించారని, పరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్య శ్రీకి దరఖాస్తు చేసుకోమని వైద్యులు సూచించినట్లు ఆమె తెలిపారు. అయితే అన్నీ అయిన తర్వాత ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సురేష్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా జూనియర్ వైద్యులతో వైద్యం అందించారని, కనీసం రక్తం ఎక్కించడం కూడా చేతకాని జూనియర్ వైద్యులతో చికిత్స చేయించడం వల్లే తన భర్త చనిపోయాడంటూ రూనీ్స ఆరోపిస్తున్నారు. ఆమెతోపాటు కుటుంబ సభ్యులు ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. ముమ్మాటికీ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడని, ఇప్పుడు మృతదేహాన్ని ఇవ్వమంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రెండు రోజులపాటు వైద్యం చేస్తున్నట్లు ఇక్కడి డాక్టర్లు హడావుడి చేశారని, ఉదయం నుంచి కోలుకుంటున్న వ్యక్తి సాయంత్రమయ్యేసరికి ఎలా చనిపోతాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లమని ఆదోళన చేశారు. విషయం తెలుసుకున్న పీఎం పాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

భక్త జన వాక

భైరవుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు


భైరవస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు


భైరవకోన రోడ్డులో నిలిచిన వాహనాలు


భైరవస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఆదివారం అమావాస్య రావడంతో భైరవవాకలోని భైరవస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. విభూదితో అర్చన చేశారు. అమృతకలశాలు సమర్పించారు. ఆలయానికి వెళ్లే సుమారు రెండు కిలోమీటర్ల మార్గం భక్తులతో కిటకిటలాడింది.వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. – సింహాచలం

‘ఉదయ కిరణాలు’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాబివర్ధన్

సీతంపేట: రచయిత డాక్టర్ మీగడ శశిభూషణ స్వామి ఆటవెలదిలో అద్భుతమైన పదజాలంతో రచించిన ఉదయకిరణాలు శతకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమని ఏయూ జర్నలిజం పూర్వ విభాగాధిపతి ఆచార్య పి.బాబివర్ధన్ అన్నారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భాషను, భావాన్ని సమన్వయం చేసుకుంటూ, సమాజాన్ని, మానవీయ కోణాన్ని తన రచనలో ఆవిష్కరించారన్నారు. సుమతీ శతకం, వేమన శతకంలా శశిభూషణ స్వామి రాసిన ఉదయకిరణాలు శతకం మంచి పేరును సంపాదిస్తుందని ఆకాంక్షించారు. సీనియర్ జర్నలిస్ట్ నాగబోయిన నాగేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. సమాజంలోని ప్రతి అంశాన్ని తీసుకుని పద్య రూపంలో పొందుపర్చారన్నారు. పుస్తక రచయిత శశిభూషణ స్వామి మాట్లాడుతూ కరోనా సమయంలో బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో సమాజానికి ఏదైనా చెయ్యాలన్న ఆలోచన శతక పద్యాలను రాసేలా చేసిందన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ జి.రాజేశ్వరరావు, రచయిత పి.చంద్రభూషణం, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాదగా మెలగండి

సీపీ శంఖబ్రత బాగ్చి


సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

జగదాంబ : హార్బర్ పోలీసు స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది ప్రజలతో మమేకం కావాలని తెలిపారు. స్టేషన్‌కు వచ్చిన వారిని కూర్చోబెట్టి మాట్లాడాలన్నారు. స్టేషన్‌ను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి ఆహ్లాదకర వాతరవారణం కల్పించాలన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పెండింగ్ కేసులు లేకుండా పరిష్కరించాలన్నారు. రిజిష్టర్లు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. సిబ్బంది సమస్యలపై ఆరా తీశారు. సిబ్బందికి కుటుంబం, ఉద్యోగపరంగా సమస్యలుంటే వెంటనే 7995095799 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. క్రైం పోలీసు స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు శిథిలం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోర్టు పరిసర ప్రాంతాల్లో ఎటువంటి దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసింగ్ చేయాలన్నారు. అనుమానిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. గంజాయి రవాణాదారులను అరెస్టు చేయాలన్నారు. విధుల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

‘ఉక్కు’ సమస్యల పరిష్కారానికి సంజీవరావు ఎనలేని కృషి


మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఏసీపీ త్రినాథ్, జీఎంలు, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారంలో హెచ్‌ఆర్ జీఎం కె.సంజీవరావు కీలక పాత్ర పోషించారని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పదవీ విరమణ చేసిన హెచ్‌ఆర్ జీఎం కంచర్ల సంజీవరావును సీ భవన్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఏసీపీ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పారిశ్రామిక సంబంధాలు మెరుగుకు సంజీవరావు ఎనలేని కృషి చేశారన్నారు. యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు సంజీవరావు సంధానకర్తగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపేవారన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ తమ అసోసియేషన్, ఓబీసీ అసోసియేషన్‌ల బైలాస్ తయారు చేయడంతోపాటు సంఘాలను విజయవంతంగా ముందుకు నడిపించడంలో సంజీవరావు ముఖ్య భూమిక వహించారన్నారు. ముందుగా మహనీయులు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, బిర్సా ముండా చిత్రపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టీల్‌ప్లాంట్ జీఎంలు ఎన్. భాను, ఎం.మధుసూదనరావు, ఠాగూర్, జయకుమార్, డాక్టర్ నాగరాజు, వివిధ సంఘాల నాయకులు కె.వి.డి.ప్రసాద్, మాటూరి శ్రీనివాసరావు, పరమట సత్యనారాయణ, జి.బోసుబాబు, ఎస్.సత్యనారాయణ, ఎస్.మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు గౌడ్


రాజు గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరిస్తున్న సంఘం సభ్యులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుల నుంచి ఆదివారం ఉత్తర్వులు అందుకున్నట్లు రాజ్ గౌడ్ తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాజు గౌడ్‌ను ఆయా కులాల ప్రతినిధులు పెదవాల్తేర్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 32 కులాలు మోస్ట్ బ్యాక్వర్డ్ క్లాసెస్ ఉన్నాయన్నారు. గత కొన్నేళ్లుగా ఉత్తరాంధ్రలోని యాత కులం సామాజిక అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన అన్ని కులాల ప్రగతికి కృషి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయుడు, గెద్దాడ రమేష్, బొంతు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.


బ్రాహ్మిణ్ వ్యాపారులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న చెరువు రామకోటయ్య

సీతంపేట: బ్రాహ్మణ వ్యాపారవేత్తలకు పరస్పర సహకారం అందజేయడం, యువ బ్రాహ్మణ వ్యాపారవేత్తలకు మెరుగైన సలహాలు, సూచనలు అందించి వారి వ్యాపారాభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యంగా బిజినెస్ బై బ్రాహ్మిణ్ పనిచేస్తోందని సంస్థ గౌరవ అధ్యక్షుడు చెరువు రామకోటయ్య తెలిపారు. శంకరమఠంలో ఆదివారం జరిగిన బిజినెస్ బై బ్రాహ్మిణ్ విశాఖ చాప్టర్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజంలో నిబద్ధత, నిజాయితీగా వ్యాపారం చేసి అందరి మన్ననలు పొందాలని వ్యాపారులకు సూచించారు. వ్యాపారం ప్రారంభించాలనుకునే ఔత్సాహికులు, బ్రాహ్మణ చిరు వ్యాపారులకు బిజినెస్ బై బ్రాహ్మిణ్ అండగా నిలుస్తుందన్నారు. వ్యాపారానికి కావలసిన మౌలిక సదుపాయాలు, ఆర్థిక వనరులు, వ్యాపారాభివృద్ధిపై సమగ్ర అవగాహన కల్పించి సహాయం అందిస్తామని చెప్పారు. సంస్థ ప్రెసిడెంట్ ధవళ మధుసూదనరావు, సెక్రటరీ పరిమి నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో అధిక సంఖ్యలో బ్రాహ్మణ వ్యాపారవేత్తలు, ఔత్సాహిక వ్యాపారవేత్తలు పాల్గొని తమ వ్యాపార వివరాలు వెల్లడించారు.

జూలో సూచిక బోర్డుల ఏర్పాటు


జూలో వన్యప్రాణులను సూచించే బోర్డు, మ్యాప్ పరిశీలిస్తున్న చిన్నారి

ఆరిలోవ: ఇందిరా గాంధీ జులాజికల్ పార్కుకు వెళ్లగానే ముందుగా కనిపించిన జంతువులు, పక్షులను చూసి సందర్శకులు సరదా పడతారు. కొన్నింటిని చూడాలని ముందుగానే అనుకొన్నా.. అవి ఎక్కడ ఉన్నాయో తెలియక నిరాశకు గురవుతుంటారు. ఇప్పుడు ఆ సమస్యకు జూ అధికారులు చెక్ పెట్టారు. ఏయే వన్యప్రాణులు ఎటువైపు ఉన్నాయో తెలుసుకునేలా సూచిక బోర్డులు, మ్యాప్‌లు ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారం, జీబ్రా ఎన్‌క్లోజర్, కనుజులు మోటో ఎదురుగా, జూ కొలను వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. జూ లోపలకు ప్రధాన ద్వారం నుంచి ప్రవేశించే సందర్శకులు ఎడమ వైపు తిరిగితే నల్ల హంసలు, ఖడ్గమృగం, ఏనుగులు, కోతులు జోన్, చింపాంజీలు, చిరుతలు, పెద్ద పులులు(ఎల్లో), తెల్ల పులులు, ఆఫ్రికన్ పక్షులు, సింహాలు, మీర్క్యాట్‌లు, ఎలుగుబంట్లు, బయోస్కోప్ వరకు చేరుకోవచ్చు. ప్రధాన ద్వారం వద్ద కుడి వైపు వెళ్తే ఆస్ట్రిచ్, ఈమూ, నిశాచర జీవుల గుహ, జీబ్రా, జిరాఫీలు, నెమళ్ల జోన్, అడవి దున్నలు, కణుజులు, లవ్ బర్డ్స్ జోన్, చుక్కల జింకలు, పాముల జోన్, నీటి ఏనుగులు, సీతాకోక చిలుకల పార్కు, బయోస్కోప్ వరకు చేరుకోవచ్చు. సాగర్ ద్వారం నుంచి జూ లోపలకు ప్రవేశించేవారు ఘరియల్(మొసళ్లు), మొసళ్ల జోన్ మీదుగా పాముల ఎన్‌క్లోజర్‌కు చేరుకోవచ్చు.

‘ఉక్కు’ను విక్రయిస్తే ప్రతిఘటన తప్పదు

అగనంపూడి : తెలుగు రాష్ట్రాల ప్రజల ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కును విక్రయించాలని చూస్తే పెద్ద ఎత్తున ప్రతిఘటన తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల సారథ్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ శక్తుల్లో కీలుబొమ్మగా మారిన కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ధరకు అప్పగించాలని చూస్తుందని, ఇటువంటి ప్రయత్నాలను అడ్డుకుని తీరుతామన్నారు. మూడేళ్లకు పైగా ఉద్యోగులు, ప్రజా సంఘాలు ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను విరమించుకోవాలని శాంతియుత నిరసనా కార్యక్రమాలు చేపడుతుంటే పట్టనట్టు వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని ప్రకటించే వరకు ఉద్యమం ఆగదన్నారు. 1270వ రోజు దీక్షా శిబిరంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్మథరావు, జె.అచ్యుతరావు, నాయకులు కొండలరావు, కసిరెడ్డి సత్యనారాయణ, మసేనురావు, జె.రామకృష్ణ, రెహమాన్, రాజబాబు, నరసింగరావు, మంత్రి రవి, మంగరాజు, నాగరాజు పాల్గొన్నారు.